
కథ

# వొత్తు థ



## రమణ జీవి

**అప్పుడు సమయం 54 గంటలా 75 నిమిషాలు.**

**మానవ కాలమానం ప్రకారం ఉ. 7-15.**

**అప్పటికి అందర్నీ పిలవడం అయిపోయింది. వొక్కణ్ణీ వెళ్ళి రచ్చమేఘం మీద కూర్చున్నాను. నా ప్రతిపాదనను విన్నప్పుడు వాళ్ళ రియాక్షన్ చూశాక ఛ! నాకెందుకు ఇంకా ఇంత తాపత్రయం అననిపించింది. కానీ వచ్చే ముందు గురజాడ అప్పారావుగారు అన్న మాట ఒకటి కాస్త వూరడింపుగా వుంది. చచ్చిన కొత్తల్లో కొన్నాళ్ళ దాకా మానవ లోకపు వాసనలు పోవు అన్నది.**

మొత్తానికి అందరూ వచ్చేశారు.

నన్నయ్య, తిక్కన, పోతన దగ్గర్నించి గురజాడ, చలం, బుచ్చిబాబు, విశ్వనాథ సత్యనారాయణ లాంటి వాళ్ళ వరకు- షేక్స్‌పియర్, గైడి మపాసా లాంటి కొంత మంది నాకు తెలిసిన విదేశీ రచయితలు రవీంద్రనాధ్ ఠాగూర్, శరత్ లాంటి దేశీయ రచయితలు ఇలా చాలా మందే పోగయ్యారు.

'ఇప్పుడు చూడండి. మీకు ఇంతకు ముందు టూకీగా విషయం చెప్పాను. ఇప్పుడు వివరంగా చెప్తా. దయచేసి విని మీ స్పందనల్ని చెప్పాల్సిందిగా మిమ్మల్ని వేడుకుంటున్నాను.

నేను మొదటిసారి జీవితంలో ఓ కథల పుస్తకం వేద్దామనుకున్నాను. అదే ఆఖరి పుస్తకం అవుతుందని అప్పుడు ఏమాత్రం వూహించలేకపోయాను. దాని పేరు రమణజీవి కథలు. పుస్తకం ప్రింటింగ్‌కి పంపే మూడ్రోజుల ముందు ఓ ఉదయం నేను షేవ్ చేసుకుంటున్నాను. మా ఆవిడ పెద్ద కత్తిపీట ముందేసుకుని కూరగాయలు తరుగుతోంది. హాస్టల్‌నించి శెలవలకి వచ్చిన మా పెద్దపాప కున్ను ఏదో రాసుకుంటోంది.

'రమణజీవి కథలనే పేరు వొద్దనిపిస్తోంది నిన్న కామంగాడితో మాట్లాడేక. ఎందుకంటే రమణజీవి అంటే ఎవడికి తెల్సు? చలమా, ప్రేంచందా, యండమూరా, మల్లాదా! ఏమన్నా పాపులర్ అయితే అట్ల పేర్తో పెట్టుకుంటే బాగుంటుంది. వద్దులే. కొంచెం ఆర్టిస్టిక్‌గా వుండే పేరు పెట్టి కింద నా పేరు పెడితే సరిపోతుంది.. ఇప్పుడు వన్‌మేన్ ఆర్కెస్ట్రా అని ఓ కథుంది. ఆ పేరు పుస్తకానికి పెట్టి కింద రమణజీవి అని పెడ్తే పోతుంది' అన్నాను మా ఆవిణ్ణి ఉద్దేశించి.

'మీకు స్వంత అభిప్రాయం లేదు. ఎంతసేపు వాళ్ళు చెప్పారు వీళ్ళు చెప్పారు అని తప్ప'

'సొంతమేముంది. ఏది మంచిదో అది చేస్తే చాల్దా'

'అహాఁ.. ఏది మంచిది. వన్‌మేన్ ఆర్కెస్ట్రా అంటే ఓ...! అని చదివేస్తారా జనం? కనీసం రమణజీవి కథలనన్నా పెడితే ఎవరన్నా మాట్లాడేటప్పుడు, పుస్తకాల రివ్యూలు రాసేటప్పుడు మీ పేరుతో రాస్తారు, మాట్లాడుకుంటారు. అట్లన్నా కాస్త పాపులారిటీ వస్తుంది'. అంది తరిగిన వంకాయ ముక్కల్ని నీళ్ళ గిన్నెలో పడేస్తూ.

'ఇదీ బాగానే వుంది. ఇంత డబ్బు పెట్టి బుక్కేసుకుంటూ ఈ మాత్రం పబ్లిసిటీ అన్నా లేకపోతే వేస్టు. సరే సరే ఇట్లే చేద్దాం లే. రమణజీవి కతలే ఫైనల్ సరేనా!' అని రేజర్ కింద పెడుతూ మా ఆవిడ కేసి చూశాను.

'కతలు కాదు మహానుభావా కథ... కథ... ముందు సరిగ్గా పలకడం నేర్చుకుంటే పుస్తకం తర్వాత వేసుకోవచ్చు' నాతో వున్న చనువుతో అన్నట్టుగానే అంది. కానీ నాకు ఒళ్ళు మండి పోయింది. అందులో పుస్తకం కూడా వేస్తున్నానాయె నా వంటి వాడితో అనదగిన మాటేనా ఇది?




'నువ్వు ఓవరేక్షన్ చెయ్యొద్దు. నాకు తెల్సు. నువ్వు నాకు చెప్పేదేంటి. అసలు కత అనేదే కరెక్ట్. చలం కతలు అని ఓ పుస్తకం కూడా వచ్చింది'

మా ఆవిడ నావేపు చురుగ్గా చూసింది.

'తాకు, థాకు డిఫరెన్స్ తెలీనోళ్లు కూడా రచయితలే! ఖర్మ, ఈ దేశాన్ని ఎవరు బాగు చేసేది?' నన్ను గాయపరచాలనే ఉద్దేశ్యం స్పష్టంగా తెలుస్తూనే వుంది.

అంతవరకు మంచం మీద కూచుని చదువుకుంటున్న మా ఇంగ్లీషు మీడియం అమ్మాయి కలగచేసుకుంది.

'నాన్నా ఏంటి చదువుకోనీరా నన్ను? ఏంటి గోల తా!.. థా!.. అనుకుంటూ..'

నాకు చాలా కోపం వచ్చింది. ఏంటి వీళ్ళు అసలు? నేనంటే ఏమనుకుంటున్నారు? ఈ కథల పుస్తకంతో ఓ వూపు వూపుదామని నేననుకుంటుంటే ఏంటీ శల్యసారథ్యాలు?

'కున్నూ నువ్వు నోర్మూసుకో. నీకు సంబంధం లేని విషయాలు ఇవన్నీ' అన్నాను కోపంగా.

'ఏంటి నాన్నా మీరు? కథంటే ప్రకృతి. కత అంటే వికృతి. ఎందుకు గొడవ దీన్ని గురించి'

నాకు ఈ విషయం గుర్తే లేదు. ఎప్పుడో చిన్నప్పుడు చదువుకున్న విషయాలు గదా.

'ఈమెకు చెప్పు ఇవన్నీ నాకెందుకూ' అని మా ఆవిడ వేపు చూశాను.

'నాకెందుకే ఆయనకే చెప్పు.. బతుకంతా వికృతుల్లో బతికే వాళ్ళకు. వినిపించుకునే రకాలయితే ఏమన్నా అనుకోవచ్చు'

'ఏంటే వినిపించుకునేది? ఆఁ! ఏం తెలుసని మీకు.. థా అంట థా! బొచ్చులో థా' అన్నాను పట్టలేనంత కోపంతో.

అంతే మా ఆవిడ కత్తిపీట చేతికి తీసుకొని 'ఏంటీ బొచ్చులో థానా' అని నా తల నరికేసింది. కొంతసేపు నేను ఏవేవో నీలం వూదారంగు పొరంగాల్లో ప్రయాణించాను. తరవాత ఈ లోకంలోకి వచ్చి చూస్తే నా భార్యా, పిల్లలు అంతా ఏడుస్తూ.

నాకు ఎక్కువసేపు ఆ భూమికి అంటి పెట్టుకోవడం సాధ్యం కాలేదు. ఇలా తేలుకుంటూ వచ్చేశాను'

అని ముగించి అందరి వేపూ చూశాను. అందరూ మౌనంగా వున్నారు.

'ఒక వొత్తూ థా కోసం మొగుణ్ణి చంపడం న్యాయమా చెప్పండి'

ఓ అయిదు నిమిషాలు ఎవరూ మాట్లాడలేదు.

ఇంతకూ మేం మాట్లాడుకుంటున్నది ఓ భాషలో కాదు. వేరే మీడియంలో.

'చూడండి రమణగారూ అక్కడ పాయింట్ వొత్తూ థా కాదు. దాని పట్ల వుండే గాఢమైన ఇష్టం. ఈ ఇష్టం దేని మీదన్నా వుండొచ్చు. ఒక రూపాయి మీద వుండొచ్చు. మతం మీద వుండొచ్చు. దేశం మీద వుండొచ్చు. అభిప్రాయాల మీద వుండొచ్చు. ఈ ఇష్టం బాగా తీవ్రంగా వున్న వాళ్ళు హత్య కూడా చెయ్యొచ్చు.' అన్నాడు టాల్‌స్టాయ్.

'గారు అనకండి. మీరు పెద్దవారు'

'మీకింకా మనుషుల లక్షణాలు పోలేదు. ఇక్కడ అంతా ఒకటే' అన్నాడు చలం.

'ఇష్టాలు అంత బలీయమైనవా? మరి ఒక ఇష్టం నించి ఇంకో ఇష్టంలోకి మారిపోయిన వాళ్ళ మాటేమిటి?'

'మనం ముందు కొన్ని విషయాల పట్లా, ఆదర్శాల పట్లా, వస్తువుల పట్లా ఎందుకు మనుషులు ఇష్టాలు ఏర్పరచుకుంటారో పరిశీలిద్దాం. ఏం? ఎందుకంటారు?'

నిదానంగా ప్రశ్నించాడు షేక్స్‌పియర్.

'వాళ్ళ కది కన్వీనియంట్. సుఖం' అన్నాను నేను.

'కదా! కొంతమందికి కాలక్రమంలో రకరకాల కారణాల వల్ల అవి సుఖాన్నివ్వడం మానేస్తాయి. అప్పుడు కొత్త ఇష్టాల్ని ఆశ్రయిస్తారు'

'ఎన్నో బాధలు పడుతూ కూడా ఆదర్శాల కోసం, ఇష్టాల కోసం బతికిన వాళ్ళను నేను చూశానండీ'

'బాధలంటే భౌతికమైన వాటి గురించి మీరు మాట్లాడుతూ వుండాలి బహుశా. మనిషికెప్పుడూ మానసికానందమే ముఖ్యం. దాని కోసం శరీరాన్ని కష్టపెట్టడానిక్కూడా వెనుకాడడు. లేదూ తనకు ఎక్కువ ముఖ్యమైన మానసిక ఆనందం కోసం తక్కువ ముఖ్యమైన మానసిక ఆనందాన్ని బలిచెయ్యడానికి కూడా వెనుకాడడు' అన్నాడు కొడవటిగంటి కుటుంబరావు.

అంతమంది మహానుభావుల్ని చూసేటప్పటికి ఇంకా విలువైన విషయాల్ని ప్రశ్నిస్తే బావుంటుందని అనిపించింది నాకు.

'మీ అప్పటి రాతల గురించి ఇప్పటి మీ అభిప్రాయం తెలుసుకోవచ్చా' అడిగాను.

'అప్పటికి ఏవి నిజాలని మేం విశ్వసించామో వాటినే రాశాం. అయితే ఇప్పుడు అనిపించేది మాత్రం వేరు. భావాలు అనేవి మనిషికి శరీరం ఎంతో ఇవీ అంతే. భావమనేది మనిషి దృష్టిని, చెవుల్ని తనకనుగుణంగా మలిచేసుకుంటుంది. దానికి భిన్నంగా వుండే ఇతరత్రా భావాలేవీ సరిగ్గా కనపడవు, వినపడవు. అంతా మసక. కాబట్టి స్పష్టంగా వుండే తన భావమే గొప్పదనుకుంటూ బతికేస్తాడు. మేమూ అలాగే బతికాము అలాగే రాశాము. ఇప్పుడు శరీరమూ లేదు భావమూ లేదు' అన్నాడు బుచ్చిబాబు.

చివర్లో మా నాన్న కలగచేసుకున్నాడు.

'నీకు చిన్నప్పట్నించీ చెబుతున్నాను ఈ కోతి రాతలు మనకు అచ్చుబాటు లేదని'

నా భార్య హత్యా నేరం తాలూకు ఫైనల్ హియరింగ్‌కు హాజరు కావాలని నేను భూమి మీదకు వచ్చాను. కోర్టుహాలు నిండా విపరీతంగా జనం. చాలా మంది రచయితలు, భాషా కోవిదులు, ప్రెస్సు వాళ్ళు.

'చూడమ్మా! నువ్వు నీ భర్తను బుద్ధిపూర్వకంగా చంపాలని చంపావా లేక కోపంలో అలా చేత్తో విసిరితే కత్తిపీట తగిలి నీ భర్త చనిపోయాడా?' పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచాడు.

'బుద్ధి పూర్వకంగానే. వొత్తు థాను తిట్టడం నేను సహించలేకపోయాను. నాకు భాషాభిమానం చాలా ఎక్కువ'

కిటకిటలాడుతున్న కోర్టుహాల్లో గుసగుసలు మొదలయ్యాయి. బహుశా ఆ మాటకు అందరూ విస్తుపోయి వుండాలి.

జడ్జి అరిచాడు సైలెన్స్ సైలెన్స్ అని.

నా భార్య నిజాయితీకి చాలా సంతోషం

వేసింది.

'నీ భర్త కంటే భాషాభిమానమే ఎక్కువా?'

'అట్లా ఎందుకుంటుంది? దేనికదే. ఆ నిమిషంలో భాషే నాకు ముఖ్యమన్పించింది'

కోర్టు బయట నించున్న వాళ్ళు కూడా తోసుకుంటూ తలలు లోపలికి చాస్తూ చూస్తున్నారు.

'మిలార్డ్ ముద్దాయి నేరాన్ని ఒప్పుకుంటోంది. మీరు తగిన శిక్ష విధించాల్సిందిగా కోరుకుంటున్నాను' అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఒక పనైపోతుందన్న ధోరణిలో.

'ఇంకా చెప్పుకునేదేమన్నా వుందామ్మా?' అని జడ్జిగారు అడిగారు. ఆయన గొంతులో దయ ధ్వనిస్తోంది. బహుశా కారణం ఆయన కాస్త సాహిత్యాభిలాషి.

'మీరేమీ బాధ పడరంటే నేనో మాటడుగుతాను. అసలు మా వారు పోయినందుకు ఈ మొత్తం కోర్టుహాల్లో ఎక్కువ బాధపడుతున్నది ఎవరు?' కుడిచేతి చూపుడు వేలును కోర్టంతా గుండ్రంగా కలయతిప్పుతూ అడిగింది.

ఎవరూ మాట్లాడలేదు.

'కొన్నిసార్లు మీకు మాటలు రావు. నాకు తెలుసు. మీ చట్టాలూ, న్యాయాలూ అలా ఏడిశాయి...'

గబగబా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కలగచేసుకున్నాడు.

'మిలార్డ్! ముద్దాయి కోర్టును, న్యాయాన్ని అపహాస్యం చేసే విధంగా మాట్లాడుతోంది. దీనికి కూడా తగిన శిక్ష విధించాల్సిందిగా కోరుకుంటున్నాను'

'దీనికేమి శిక్ష విధిస్తారు? రెండు సార్లు వురి తీస్తారా..' అడిగింది నా భార్య.

కొంత మంది నవ్వేరు. జడ్జిగారు కలగచేసుకున్నారు గడ్డం కింద చెయ్యి పెట్టుకుంటూ.

'సైలెన్స్... సైలెన్స్... అబ్జెక్షన్ ఓవర్రూల్డ్... నువ్వు చెప్పమ్మా'

జడ్జిగారికే కాదు. అక్కడున్న అందరికీ ఆమె మాటలు వినాలని ఎంతో కుతూహలంగా వుంది.

'నేను.. ఈ ప్రపంచం మొత్తం మీద ఈ సంఘటనకు బాధపడుతున్నది నేను. మధ్యలో మీ గోలంతా ఏమిటి? మా ఆయన లేకపోవడమే నాకు పెద్ద శిక్ష. మళ్ళీ శిక్ష... శిక్షని నా వెంటపడడంలో ఏమన్నా అర్థముందా? ఆలోచించుకోండి! చూసుకోండి మీ పుస్తకాల్లో ఏం రాసుందో!!'

జనంలో కలకలం బయలుదేరింది. ప్రెస్సు వాళ్ళు ఫోటోలు తీసుకోడానికి తోసుకుంటూ ముందుకు వస్తున్నారు.

'సరే! మీ బాధలు మీవి. నేను హత్య చేసిన మాట వాస్తవం. అయితే దాన్ని తప్పని ఏ మాత్రం అనుకోను. తప్పుని నిరూపించండి ముందు. నేను దేనికైనా సిద్ధం'

జడ్జిగారు అయోమయంలో పడిపోయినట్టుగా తల వొంచుకుని కూర్చున్నారు.

'మిలార్డ్! ఇందులో ఆలోచించడానికేమీ లేదు మిలార్డ్, ధన ప్రాణ మాన సంరక్షణార్థం మాత్రమే మనిషిని ఇంకో మనిషి చంపితే ఆలోచించాల్సిన అవసరం వుంది' పబ్లిక్ ప్రాసిక్యూటర్ తొందరపడుతున్నట్టుంది.

నా భార్య అడిగింది వున్నట్టుండి.

'మానసిక హింసకు మీ చట్టాల్లో ఏమీ ప్రాధాన్యత లేదా?'

అందరూ నిశ్శబ్దమైపోయారు. మూడు నిమిషాల తర్వాత జడ్జిగారు ఈ విధంగా అన్నారు.

'మానసిక హింసను తప్పకుండా కోర్టువారు పరిగణనలోకి తీసుకుని హతుడు అన్న మాటలు ముద్దాయిని ఎంత తీవ్రంగా గాయపరిచాయో లేక గాయపరచగలవో నిర్ణయించడానికి ఓ కమిటీని వేసి నిర్ధారించవలసిందిగా నేను ప్రభుత్వం వారిని కోరుకుంటున్నాను. ఈ కమిటీలో ప్రముఖులైన భాషావేత్తలు, రచయితలు వుండాలని ఆశిస్తున్నాను'

కేసు వాయిదా పడింది.

కార్గిల్, ఎలక్షన్స్, ఒరిస్సా తుపానుల తర్వాత చప్పగా వున్న పత్రికలకు, టీవీలకు ఈ కేసు బోలెడంత మెటీరియల్‌ని సమకూర్చింది. న్యూస్ పేపర్లయితే మొదటి పేజీల్లో అచ్చేసాయి. 'భాష కోసం భర్తను చంపిన భార్య' అని అనేక వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి.

ఈ విధంగా అయినా నా కథా సంకలనం ఓ సెన్సేషన్ సృష్టించింది.

మా వూరు రాజంపేటకు వెళ్ళి మా అమ్మను టీవీ వాళ్ళు ఇంటర్వ్యూ చేశారు.

'చూడమ్మా! మీ కోడలు చేసిన ఈ పని మీద మీ అభిప్రాయమేంటి?'

'మనిషి మంచిదే, ఏం ముసించిందో. దాని వొత్తు థా పాడుగాను! బంగారం లాంటి నా బిడ్డను పొట్టన పెట్టుకుంది' అంది విచారంగా.

పత్రికా విలేకర్లు సత్తెనపల్లిలోని మా ఆవిడ పుట్టింటి మీద దండయాత్ర చేశారు.

'అనసూర్యమ్మగారూ ఈ జరిగిందాన్ని మీరెలా తీసుకుంటున్నారు?'

'ఇట్లా జరక్కుండా వుండాల్సింది. దాని ఖర్మ. దానికి బుద్ధి ఎందుకు పుట్టిందో? అంతా ఆ భగవంతుడి రాత'

'దీని వెనక పాత గొడవలేమైనా వున్నాయా? మీ అల్లుడు మంచి వాడేనా??' కూపీ లాగే ప్రయత్నం.

'అయ్యో అలా అంటారేంటి నాయనా? వారు దేవుళ్లాటి మనిషి. అలాంటి మనిషిని మళ్ళీ చూళ్ళేము' చచ్చిన వాణ్ణి ఎవరు మాత్రం ఎలా చూస్తారు?

'మీ అమ్మాయి మతి సరిగ్గానే వుండేదా చిన్నప్పట్నించీ?'

'చాలా ఖచ్చితమైన మనిషి బాబూ. ముక్కుసూటి స్వభావం. తన మనసుకు ఏది తోస్తే అది మొహాన్నే అనేస్తుంది ఎంతవాళ్ళనైనా (ఇంత వరకూ బాగానే వుంది) ఏది తోస్తే అది నిర్భయంగా చేసేస్తుంది (అదే నా కొంప ముంచింది)'.

ఓ కమిటీ ఏర్పాటయింది, 23 మంది ప్రముఖులయిన భాషావేత్తలు, ప్రఖ్యాత రచయితలు, ప్రొఫెసర్లతో. అందరూ కూచుని భాషాశాస్త్రాన్ని క్షుణ్ణంగా చర్చించారు. కేసుకు అసలు మూలకారణమైన 'కత'లోని తప్పొప్పుల్ని గురించి విచారించారు. కొన్ని టీవీ చానళ్ళు ప్రత్యక్ష ప్రసారం కూడా చేశాయి.


భాష అంటే ఏమిటి అన్న దాని దగ్గర్నించి మొదలయింది.

'మనసులో కలిగే స్పందన నాలుక, పెదాల కదలిక ద్వారా తనను తాను అప్రయత్నంగా వ్యక్తం చేసుకొనే క్రమం'

'ఇది జంతువుల స్థాయి వ్యక్తీకరణ. మనిషి అవసరాలు చాలా. ప్రయత్నపూర్వకంగా వ్యక్తీకరించాల్సిన ఎన్నో అవసరాలు మనిషికున్నాయి. అప్పుడు భాషను మరింత విస్తృతం మరింత వ్యవస్థీకృతం చేసుకోవాల్సిన అవసరం వుంది. అప్పుడు ఖచ్చితమైన మార్గదర్శకత్వాలు లేకపోతే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మీ ఇష్టమొచ్చినట్టు భాషను మార్చడానికి వీల్లేదు'

'మనోభావాలనన్నిట్నీ చెప్పుకోడానికి సరిపడా భాష వుందా మనకు?' ఓ ప్రొఫెసర్ చాలా సీరియస్‌గా తీసుకున్నాడు ఈ విషయాల్ని.

కార్గిల్, ఎలక్షన్స్, ఒరిస్సా తుపానుల తర్వాత చప్పగా వున్న పత్రికలకు, టీవీలకు ఈ కేసు బోలెడంత మెటీరియల్‌ని సమకూర్చింది. న్యూస్ పేపర్లయితే మొదటి పేజీల్లో అచ్చేసాయి. 'భాష కోసం భర్తను చంపిన భార్య' అని అనేక వార్తా కథనాలు ప్రచురితమయ్యాయి



'లేకపోవచ్చు, లేక.. లేదు. వేరే భాషల్లోంచి కావాలంటే దిగుమతి చేసుకుందాం. అప్పటికీ చాలకపోతే రెండు మూడు మాటల్ని కలిపి వ్యక్తీకరించే ప్రయత్నం చేసుకుందాం'

'అట్లా చెప్పిన విషయం ఎదుటి వాళ్ళకు అందుతుందని గ్యారంటీ వుందా'

'ఆ విషయానికొస్తే ఏమీ గ్యారంటీ లేదు. అసలు మీరు అనుభవించిందాన్ని మీరు ఖచ్చితంగా మాటల్లో చెప్పగలనని గ్యారంటీ ఇవ్వగలరా?'

ఆ ప్రొఫెసర్ ఇవ్వలేనని ఒప్పుకున్నాడు.

రక్తమాంసాలంత నిజమైన అనుభవాన్ని మాటల్లో కుదించే ప్రయత్నమేమిటి?

అనుభవమేమిటి?.. అనుభవించే వాడెవడు.. దాన్ని ఇంకొకడికి చెప్పే వాడెవడు??

ఓ సంవత్సరం పిల్లాడు అనేక అనుభూతుల్తో అనేక కేకలు వేస్తాడు. అవన్నీ బయటికి చెప్పలేకపోయినంత మాత్రాన అర్థరహితాలా! వాటికే విలువా లేదా ఈ నాగరిక లోకంలో? భాషకు మించిన సాధనమేదీ లేదా వాటిని గుర్తించడానికి?

అసలు ఇతర్ల భావాలను ఎందుకు తెలుసుకోవాలి. జీవితానుభవాల్ని స్వీకరిస్తూ బతకడం ఒక్కటే చాలదా? ఒకళ్ళ ఫీలింగ్స్‌తో ఇంకోళ్ళకు అవసరం ఎందువల్ల కలిగింది?

ఇట్లా చాలా దూరం వెళ్ళిపోయి ఆ ప్రొఫెసర్ కాలేజీకి వెళుతున్నానని ఇంటి దగ్గర చెప్పి సాయంత్రం దాకా పబ్లిక్ గార్డెన్స్‌లో కూర్చుని మళ్ళీ కాలేజీ వొదిలే సమయానికి ఇంటికెళ్ళడం ప్రారంభించాడు. ప్రొఫెసర్‌కు పిచ్చెక్కిందని అందరూ అనుకోడం ప్రారంభించారు.

మనస్థాపం చెందిన వాళ్ళావిడ ఆ కమిటీ మీద నష్టపరిహారం కేసు దాఖలు చేసింది. అడ్డమైన పుస్తకాలు మా ఆయన చేత చదివించి, చర్చించి ఆయన మనసు పాడు చేశారని.

మొత్తానికి కత అన్నది తప్పు కాదని నిర్ధారించారు. తరవాత బొచ్చు అన్న మాటని గురించి విశ్లేషణ జరిగింది.

బొచ్చు అన్నది తిట్టుగా ఎందుకు మారింది. బొచ్చు అంతా తిట్టు కాదు. స్థల ప్రాధాన్యతను బట్టి 'కొంతమేర'కు మాత్రమే తిట్టు.

ఈ 'కొంత మేర' అనేది జంతువులకు ఎందుకు లేదు? మనుషులకు మాత్రమే ఎందుకు? అన్న దాని మీద కూడా చర్చ జరిగింది.

ఈ విధంగా అనేక కోణాల్లో ఆలోచించి ఈ రిపోర్టు తయారయింది.

మళ్ళీ కోర్టుహాలు! కిటకిటా జనం!!

కత అన్నది తప్పు కాదనీ, బొచ్చు అన్న మాటకి హత్యకు ప్రేరేపించేటంతటి శక్తి లేదని నిర్ధారించి ఐపిసి 302 సెక్షన్ కింద ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

సరే, తరవాత నేను మా లోకం వెళ్ళిపోయాను. అక్కడ మీకు చెప్పడానికి వీలుపడని అనేక సాధనా కార్యక్రమాల్లో మునిగిపోయాను. ఎందుకంటే అవి భాషకు కాదు ఆలోచనకు కూడా అందని వ్యవహారాలు. చాలాకాలం తర్వాత ఒకసారి నా భార్యను, పిల్లల్ని చూడాలనిపించి భూమ్మీదకి వచ్చాను.

మా పెద్దమ్మాయి చదువుకుంటోంది.

చిన్నమ్మాయి మాత్రం పెళ్ళి చేసేసుకుంది. ఒక బాబు కూడా.

జైలుకు వెళ్ళి చూశాను.

మా ఆవిడ ఒక్కతే ఖైదులో కూచుని గోడల నిండా బొగ్గుముక్కతో వొత్తు థాని రాసుకుంటోంది.